

## చల్లచల్లని వస్త్రం

షికాగో, జూన్ 14: సూర్యరశ్మి, థర్మల్ రేడియేషన్ నుంచి రక్షణ కల్పించి శరీరాన్ని చల్లగా ఉంచే వస్త్రాన్ని శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. షికాగోలోని ప్రిజర్ స్కూల్ ఆఫ్ మాలిక్యులర్ ఇంజినీరింగ్ పరిశోధకుల బృందం ఈ వస్త్రాన్ని తయారుచేసింది. భవిష్యత్తులో వాతావరణ మార్పులతో ఉష్ణోగ్రతలు మండిపోతాయని, దాన్ని తట్టుకొనేలా దీన్ని రూపొందించినట్లు వెల్లడించారు. క్లాత్, బిల్డింగ్, కార్ డిజైన్, ఫుడ్ స్టోరేజీకి ఈ వస్త్రాన్ని ఉపయోగించవచ్చని పేర్కొన్నారు. ఈ ఫ్యాబ్రిక్ శరీర ఉష్ణోగ్రతను 14 డిగ్రీల ఫారన్‌హీట్ మేర తగ్గించగలదని వివరించారు.

## తూనీగలకు శ్వాసతోనే క్యాన్సర్‌ను గుర్తించగల శక్తి

న్యూయార్క్, జూన్ 14: మన శ్వాసను బట్టి మనకు ఊపిరితిత్తుల క్యాన్సర్ ఉన్నదా? లేదా? అని గుర్తించే శక్తి తూనీగలకు ఉన్నదని శాస్త్రవేత్తలు తాజాగా తేల్చారు. శునకాల మాదిరే కీటకాలు కూడా వాసనలు సరిగ్గా గుర్తించగలవని అమెరికాలోని మిషిగన్ స్టేట్ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు తెలిపారు. ఊపిరితిత్తుల క్యాన్సర్ ఉన్న వ్యక్తి శ్వాస ద్వారా బయోమార్కర్లను తూనీగలు గుర్తించాయని వెల్లడించారు. ల్యాబ్‌లో నిర్వహించిన పరీక్షల్లో ఈ ఆశ్చర్యకర విషయం వెలుగులోకి వచ్చిందని వివరించారు. దాదాపు 20 తూనీగలపై చేసిన పరీక్షల్లో కచ్చితమైన ఫలితాలు సాధించామని పేర్కొన్నారు.

## డబ్ల్యూహెచ్‌ఓ సహకార కేంద్రంగా ఎన్‌ఐఐఎంహెచ్

న్యూఢిల్లీ: సంప్రదాయ వైద్యంలో పరిశోధన కోసం హైదరాబాద్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ మెడికల్ హెరిటేజ్(ఎన్‌ఐఐఎంహెచ్)ను సహకార కేంద్రంగా ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్‌ఓ) గుర్తించింది. నాలుగేండ్ల కాలానికి ఈ గుర్తింపు ఉంటుందని ఆయుష్ శాఖ ప్రకటించింది. ఆయుర్వేద, యునాని, సిద్ధ వంటి సంప్రదాయ వైద్య పద్ధతులపై పరిశోధన కోసం డబ్ల్యూహెచ్‌ఓకు ఈ సంస్థ సహకారం అందించనుంది.

# రోజు నిడివి మారుతున్నదా?

- నెమ్మదించిన భూమి అంతర్భాగ భ్రమణం
- అమెరికా పరిశోధకుల అధ్యయనంలో వెల్లడి

న్యూయార్క్, జూన్ 14: భూభ్రమణం నెమ్మదించిందా ? ఫలితంగా రోజు నిడివి మారబోతున్నదా ? అంటే అవుననే అంటున్నారు అమెరికాలోని సదరన్ కాలిఫోర్నియా యూనివర్సిటీకి చెందిన పరిశోధకులు. గ్రీన్‌లాండ్, అంటార్కిటికాలో మంచు వేగంగా కరుగుతుండటం వల్ల భూభ్రమణం నెమ్మదించిందని, ఇది సమయంపై ప్రభావం చూపబోతున్నదని ఇటీవల ఒక అధ్యయనంలో వెల్లడైంది. తాజాగా సదరన్ కాలిఫోర్నియా వర్సిటీ పరిశోధకులు ఇందుకు సంబంధించి కొత్త విషయం చెప్పారు. భూమి ఉపరితలంతో పోలిస్తే అంతర్భాగం(ఇన్నర్ కోర్) భ్రమణం మందగించిందని వీరు ఒక అధ్యయనంలో తేల్చారు. ఇనుము, నికెల్‌తో కూడి భూమి ఇన్నర్ కోర్ భ్రమణం చాలా దశాబ్దాల తర్వాత 2010 నుంచి మందగించిందని ఈ అధ్యయనానికి



నేతృత్వం వహించిన డంకన్ అగ్న్యూ తెలిపారు. ఫలితంగా రోజు నిడివిలో సెకనులో ఒక భాగం మేర మారొచ్చని పేర్కొన్నారు. భూకంపాల ద్వారా సంభవించే తరంగాలపై చేసిన ఈ అధ్యయనానికి సంబంధించిన వివరాలు 'నేచర్' జర్నల్‌లో ప్రచురితమయ్యాయి.

# జపాన్ నుంచి రక్తాన్ని తెప్పించి..

**గర్భస్థ శిశువును కాపాడిన ఎయిమ్స్ వైద్యులు**

న్యూఢిల్లీ : అఖిల భారత వైద్య, విజ్ఞాన శాస్త్రాల సంస్థ (ఎయిమ్స్)లో అద్భుతం జరిగింది. అత్యంత అరుదైన రక్త సంబంధిత వ్యాధితో బాధపడుతున్న మహిళకు మృత శిశువు జన్మించకుండా కాపాడింది. వివరాల్లోకి వెళితే... హర్యానాలోని గ్రామీణ ప్రాంత మహిళ ఒకరు ఏడుసార్లు గర్భం ధరించి, అన్నిసార్లూ గర్భంలోనే శిశువును కోల్పోయారు. ఎనిమిదోసారి ఆ దంపతులు న్యూఢిల్లీలోని ఎయిమ్స్‌ను సంప్రదించారు. ఆమె శరీరంలోని యాంటీబాడీస్ ఆమె గర్భంలోని శిశువుకు ముప్పుగా పరిణమిస్తున్నాయని వైద్యులు గుర్తించారు. గర్భిణి రక్తం ఆర్‌హెచ్ నెగెటివ్ గ్రూప్ అని, అది ఆమె గర్భంలోని శిశువు బ్లడ్ టైప్‌నకు భిన్నమైనదని గుర్తించారు. ఆ గర్భస్థ శిశువును ప్రాణాలతో కాపాడాలంటే, ఇంట్రాయుటెరిన్ బ్లడ్ ట్రాన్స్‌ఫ్యూజన్ చేయడం ఒకటే ఏకైక మార్గమని నిర్ణయించారు. ఆర్‌హెచ్ నెగెటివ్ బ్లడ్ గ్రూప్‌గలవారు లక్ష మందిలో ఒకరే ఉంటారు. భారత దేశంలో ఈ రక్తంగలవారు ఒకరు కనిపించినప్పటికీ, రక్తదానం చేయడానికి ఆ వ్యక్తి నిరాకరించారు. వెంటనే ఇంటర్నేషనల్ బ్లడ్ రిజిస్ట్రీకి సమాచారం అందించారు. జపాన్‌లోని రెడ్ క్రాస్ సొసైటీ స్పందించి, ఈ రక్తాన్ని భారత్‌కు పంపించింది. 48 గంటల్లో ఈ రక్తం న్యూఢిల్లీలోని ఎయిమ్స్‌కు చేరుకుంది. ఈ రక్తాన్ని గర్భిణి గర్భంలోని శిశువుకు ట్రాన్స్‌ఫ్యూజ్ చేశారు. ఆరోగ్యవంతమైన ఆడ శిశువు జన్మించింది.

## నెట్‌ఫ్లిక్స్‌లో 'మహరాజ్' విడుదలపై హైకోర్టు స్టే

న్యూఢిల్లీ: వైఆర్‌ఎఫ్ ఎంటర్‌టైన్‌మెంట్ రూపొందించిన చిత్రం 'మహరాజ్' షెడ్యూలు ప్రకారం శుక్రవారం నెట్‌ఫ్లిక్స్‌లో విడుదల కాలేదు. ఈ చిత్రం వైష్ణవుల మనోభావాలను దెబ్బతీస్తున్నదని, దీనివల్ల సమాజంలో హింస పెరుగుతుందని పుష్టిమార్గ్ సభ్యులు గుజరాత్ హైకోర్టును ఆశ్రయించారు. విచారణ జరిపిన హైకోర్టు ఈ చిత్రం విడుదలను నిలిపేసింది. బాలీవుడ్ నటుడు అమీర్ ఖాన్ కుమారుడు జునైద్ ఖాన్ ఈ చిత్రంతోనే తన నట జీవితాన్ని ప్రారంభించాడు. ఓ వైష్ణవ మఠాధిపతికి తన మహిళా భక్తులతో లైంగిక సంబంధాలు ఉన్నట్లు పాత్రికేయుడు కర్సన్‌దాస్ ముల్జి ఓ గుజరాతీ వార పత్రికలో ఆరోపించారు. ముల్జిపై ఆ మఠాధిపతి పరువు నష్టం కేసు దాఖలు చేశారు. 1862నాటి ఈ కేసు ఆధారంగా ఈ చిత్రాన్ని నిర్మించారు. ఇదిలావుండగా, ఈ చిత్రాన్ని, నెట్‌ఫ్లిక్స్‌ను నిషేధించాలని అనేక మంది సామాజిక మాధ్యమాల యూజర్లు డిమాండ్ చేస్తున్నారు.

## చైనాలో మీటూ ఉద్యమ ప్రచారం.. జర్నలిస్టుకు ఐదేండ్ల జైలు




బీజింగ్: మహిళకు జరిగిన అన్యాయాన్ని వెలికి తీసినందుకు చైనాలో ఒక మహిళా జర్నలిస్టుకు ఐదేండ్ల కారాగార శిక్ష పడింది. మహిళలు ఎదుర్కొంటున్న వేధింపులపై ప్రారంభమైన 'మీ టూ' ఉద్యమంలో హువాంగ్ షియేకిన్ అనే జర్నలిస్టు భాగస్వామి అయ్యారు. తన దేశంలో మహిళలపై జరుగుతున్న వేధింపులను 2018లో వెలికి తీశారు. ఒక విద్యార్థినిపై ఆమె పీహెచ్‌డీ సూపర్‌వైజర్ పాల్పడిన లైంగిక వేధింపులను ఆమె ప్రచురించి బాహ్య ప్రపంచానికి తెలియజేశారు. ప్రభుత్వ విధానాలను ప్రశ్నించిందన్న ఆరోపణతో ఆమెకు ఐదేండ్ల శిక్షతో పాటు 100,000 యువాన్‌లు జరిమానా విధించారు.

# నటి హేమకు బెయిల్

బెంగళూరు: రేవ్ పార్టీ కేసులో అరెస్టయిన నటి హేమ శుక్రవారం జైలు నుంచి విడుదలయ్యారు. ఆమెకు ఎన్‌డీపీఎస్ స్పెషల్ కోర్టు షరతులతో కూడిన బెయిలును మంజూరు చేసింది. దర్యాప్తునకు సహకరించాలని ఆమెను కోర్టు ఆదేశించింది. ఆమె ఈ నెల 3 నుంచి కస్టడీలో ఉన్నారు. బెంగళూరు సీసీబీ పోలీసులు మే 19న రేవ్ పార్టీపై నిర్వహించిన దాడిలో హేమ సహా 86 మంది పట్టుబడిన సంగతి తెలిసిందే. వీరి రక్త నమూనాలను సేకరించి, పరీక్షలు చేయించారు. వీరు మాదక ద్రవ్యాలను సేవించినట్లు పరీక్షల్లో నిర్ధారణ అయినట్లు పోలీసులు తెలిపారు. అయితే తాను మాదక ద్రవ్యాలను సేవించలేదని హేమ చెప్తున్నారు.



## షీనా బోరా కేసులో ఎముకలు గల్లంతు

ముంబై : షీనా బోరా (24) హత్య కేసులో మరో సంచలనం జరిగింది. ఈమె 2012 ఏప్రిల్‌లో హత్యకు గురైనట్లు 2015లో వెలుగులోకి వచ్చింది. ఆమె తల్లి ఇంద్రాణీ ముఖర్జియా ఈ కేసులో ప్రధాన నిందితురాలు. షీనా మృతదేహాన్ని తగులబెట్టి, పూడ్చిపెట్టారు. పోలీసులు మహారాష్ట్రలోని రాయ్‌గఢ్‌లో ఈ మృతదేహాన్ని గుర్తించి, ఎముకలు, మరికొన్ని వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో సాక్ష్యం చెప్పేందుకు ఫోరెన్సిక్ డాక్టర్ గురువారం సీబీఐ కోర్టులో హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రాసిక్యూషన్ స్పందిస్తూ, పోలీసులు స్వాధీనం చేసుకున్న ఎముకలు, ఇతర వస్తువులు ఇప్పుడు కనిపించడం లేదని తెలిపింది. అయినప్పటికీ, వాటిని ఆ డాక్టర్‌కు చూపించకుండానే, చీఫ్ ఎగ్జామినేషన్‌ను కొనసాగించాలనుకుంటున్నట్లు తెలిపింది. దీనికి అభ్యంతరం లేదని డిఫెన్స్ అడ్వకేట్స్ చెప్పడంతో కోర్టు తదుపరి విచారణను ఈ నెల 27కు వాయిదా వేసింది.

## అధ్యక్షునిగా ఎన్నుకుంటే ఆదాయ పన్ను రద్దు

**అమెరికన్లకు డొనాల్డ్ ట్రంప్ హామీ**

వాషింగ్టన్, జూన్ 14: అమెరికా అధ్యక్ష పీఠాన్ని మరోసారి కైవసం చేసుకోవాలన్న లక్ష్యంతో రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి, మాజీ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తమ ప్రజలపై హామీల జల్లు కురిపిస్తున్నారు. ఈ ఏడాది నవంబర్‌లో జరుగనున్న ఈ ఎన్నికల్లో తనను గెలిపిస్తే ఆదాయ పన్ను చెల్లింపుల నుంచి అమెరికన్లకు విముక్తి కల్పిస్తానని, దాని స్థానంలో విస్తృతమైన సుంకాల విధానాన్ని (టారిఫ్‌ల పాలసీని) అమలు చేస్తానని ప్రకటించారు. వాషింగ్టన్ డీసీలోని క్యాపిటల్ హిల్ క్లబ్‌లో గురువారం ఆయన అమెరికా పార్లమెంట్ సభ్యులతో జరిపిన సమావేశంలో ఈ విధానాన్ని తెరపైకి తీసుకొచ్చారు. సమస్యాత్మక సంస్థలతో జరిపే చర్చల్లో సుంకాలను సాధనంగా ఉపయోగించుకోవాలని ఈ భేటీలో ట్రంప్ ప్రతిపాదించినట్టు సీఎన్‌బీసీ వార్తా సంస్థ వెల్లడించింది. గతంలో ట్రంప్ అమెరికా అధ్యక్షునిగా పనిచేసినప్పుడు విదేశాంగ విధానంలో సుంకాలను బహుముఖ అస్త్రంగా ప్రయోగించిన విషయం తెలిసిందే. ఈసారి అధ్యక్ష ఎన్నికల్లో జో బైడెన్‌పై విజయం సాధిస్తే మరింత రక్షణాత్మక ధోరణితో కూడిన వాణిజ్య ఎజెండాను అమలు చేయాలని ట్రంప్ భావిస్తున్నట్టు ఆయన తాజా ప్రతిపాదన స్పష్టం చేస్తున్నది. అయితే ఈ ప్రతిపాదనపై పలు వర్గాల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఆదాయ పన్ను స్థానంలో టారిఫ్‌లను తీసుకురావడమంటే దిగువ, మధ్యతరగతి అమెరికన్లను తీవ్రంగా దెబ్బతీసి సంపన్నులకు లబ్ధి చేకూర్చడమే అవుతుందని ఆ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి.

## పథకాలు అందుతున్నది 29% వృద్ధులకే

న్యూఢిల్లీ: వృద్ధుల్లో కేవలం 29 శాతం మందికి మాత్రమే వృద్ధాప్య పింఛను, భవిష్య నిధి వంటి సామాజిక భద్రత పథకాలు అందుతున్నాయని ఎన్‌జీఓ హెల్ప్‌ఏజ్ అధ్యయనం వెల్లడించింది. కుటుంబ సభ్యుల నుంచి ఆర్థిక సాయం పొందుతున్నవారు కూడా దాదాపుగా ఇదే సం ఖ్యలో ఉంటారని తెలిపింది. కుటుంబ మద్దతు పొందుతున్న వృద్ధుల్లో పురుషుల కన్నా మహిళలే ఎక్కువ అని వివరించింది. పనిలో భాగస్వామ్యం, ఆర్థిక భద్రత, ఆరోగ్యం, సంరక్షణ, సాంఘిక భాగస్వామ్యం, డిజిటల్ యాక్సెస్ సంబంధిత సమస్యలపై ఈ అధ్యయనం జరిగింది. దేశంలోని 10 రాష్ర్టాల్లోని 20 టైర్-1, టైర్-2 నగరాల్లో 5,169 మంది వృద్ధులను, 1,333 మంది కేర్‌గివర్స్‌ను ప్రశ్నించి, ఈ నివేదికను రూపొందించారు.

## కశ్మీర్ బడుల్లో జాతీయ గీతాలాపన తప్పనిసరి

శ్రీనగర్: జమ్ము కశ్మీరు కేంద్ర పాలిత ప్రాంతంలోని అన్ని పాఠశాలల్లోనూ ఉదయపు ప్రార్థనలను జాతీయ గీతంతో ప్రారంభించాలని పాఠశాల విద్యా శాఖ ఆదేశించింది. అన్ని పాఠశాలల్లోనూ ఏకరీతిగా మార్నింగ్ అసెంబ్లీని నిర్వహించాలని తెలిపింది. విద్యార్థుల్లో ఐకమత్యం, క్రమశిక్షణ భావాల నునింపడానికి ఇది ఎంతగానో దోహదపడుతుందని స్పష్టం చేసింది. నైతికత, చిత్తశుద్ధి, సామాజిక స్పృహ, మానసిక ప్రశాంతతలను పెంచి పోషించే వేదికలుగా మార్నింగ్ అసెంబ్లీస్ ఉపయోగపడతాయని చెప్పింది. అతిథులను ఆహ్వానించి, పర్యావరణ పరిరక్షణ, మాదక ద్రవ్యాల వల్ల కలిగే దుష్ఫలితాలు వంటివాటిపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని తెలిపింది.






## 30 ఏండ్లకు తీర్పు.. 2 వేలు జరిమానా

**యూపీలో ఓ దాడి కేసులో ఎట్టకేలకు కోర్టు తీర్పు**

లక్నో, జూన్ 14: ఉత్తరప్రదేశ్‌లో 1994లో జరిగిన ఒక దాడి కేసులో ఎట్టకేలకు 30 ఏండ్ల తర్వాత స్థానిక కోర్టు తీర్పు వెలువరించింది. నిందితులకు కేవలం రూ.2 వేల జరిమానా విధించి కేసును ముగించింది. యూపీలోని కమసిన్ పోలీస్ స్టేషన్ పరిధిలో 1994లో రామ్‌రూప్ శర్మ అనే వ్యక్తిపై అదే ప్రాంతానికి చెందిన ముగ్గురు వ్యక్తులు దాడి చేశారు. మద్యానికి అలవాటు పడిన నిందితులు.. రామ్‌రూప్‌ను బంధించి, దాడి చేయడంతో పాటు డబ్బులు డిమాండ్ చేశారు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎఫ్‌ఐఆర్ నమోదు కావడం, చార్జ్‌షీట్ దాఖలు చేయడం కూడా అప్పట్లోనే జరిగిపోయాయి. అయితే, కోర్టులో మాత్రం కేసు ఏండ్ల తరబడి కొనసాగింది. వందల సార్లు కేసు వాయిదా పడింది. ఈ క్రమంలో 15 మంది న్యాయమూర్తులు మారారు. అయినా రామ్‌రూప్ తన న్యాయపోరాటాన్ని కొనసాగించారు. చివరకు జూన్ 13న యూపీలోని బండ న్యాయస్థానం తీర్పు వెలువరించింది. ఈ దాడికి పాల్పడ్డ ముగ్గురిలో ఒకరు ఇప్పటికే మరణించగా మిగతా ఇద్దరికి చెరో రూ.2 వేల జరిమానాను కోర్టు విధించింది. నేర వృత్తిలో ఉన్న నిందితులపై అనేక కేసుల్లో నేరాలు రుజువయ్యాయని, ఇంత చిన్న శిక్ష వారిపై ప్రభావం చూపదని బాధితుడు వాదించినప్పటికీ లాభం లేకుండా పోయింది. కాగా, ఘటన జరిగినప్పుడు 40 ఏండ్ల వయస్సున్న బాధితుడి వయస్సు ఇప్పుడు 70 ఏండ్లు. అప్పుడు యువకులుగా ఉన్న నిందితులు ఇప్పుడు వృద్ధాప్యానికి చేరువగా ఉన్నారు.

## దక్షిణాఫ్రికా అధ్యక్షుడిగా మళ్లీ రామాఫోసా?

కేప్‌టౌన్: దక్షిణాఫ్రికా అధ్యక్షునిగా సిరిల్ రామాఫోసా మరోసారి ఎన్నికయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఆయన నేతృత్వంలోని ఆఫ్రికన్ నేషనల్ కాంగ్రెస్ (ఏఎన్‌సీ)కి దేశంలోని రెండో అతి పెద్ద పార్టీ డెమొక్రాటిక్ అలయెన్స్ (డీఏ) మద్దతు పలికింది. ఈ రెండు పార్టీలకు పార్లమెంటులో అత్యధిక ఎంపీల బలం ఉంది. డీఏతో సూత్రప్రాయంగా ఓ ఒప్పందం కుదుర్చుకున్నట్లు ఏఎన్‌సీ గురువారం ప్రకటించింది. 400 మంది సభ్యులు గల నేషనల్ అసెంబ్లీ శుక్రవారం ఉదయం 10 గంటలకు సమావేశమవుతుంది. ముందుగా స్పీకర్, డిప్యూటీ స్పీకర్ ఎన్నికలు జరుగుతాయి. ఆ తర్వాత దేశాధ్యక్షుడిని ఎన్నుకుంటారు.

# చన్నపట్నం కాంగ్రెస్ అభ్యర్థిగా దర్శన్?

**పోటీ చేయిద్దామనుకున్న డీకే శివకుమార్**



దర్శన్

రామనగర (కర్ణాటక), జూన్ 14: హత్య కేసులో అరెస్టయిన కన్నడ నటుడు దర్శన్ తూగుదీపకు, కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్‌కు ఉన్న సంబంధంపై బీజేపీ నేత ఒకరు సంచలన ఆరోపణలు చేశారు. జేడీ(ఎస్) నేత, మాజీ సీఎం కుమారస్వామి కేంద్ర మంత్రి కావడంతో ఆయన ప్రాతినిధ్యం వహించిన చన్నపట్నం అసెంబ్లీకి ఉప ఎన్నిక అనివార్యమైంది. అక్కడ దర్శన్‌ను పోటీ చేయించాలని డీకే శివకుమార్, అతని సోదరుడు, మాజీ ఎంపీ డీకే సురేష్ ప్రణాళికలు సిద్ధం చేశారని బీజేపీ నేత సీపీ యోగేశ్వర్ తెలిపారు. 'చన్నపట్నం కాంగ్రెస్ అభ్యర్థిగా ప్రకటించాలనుకున్న నటుడు ఇప్పుడు జైలులో ఉన్నారు. అతడిని రంగంలోకి దింపి ప్రజలను ఆశ్చర్యపరుద్దామని కాంగ్రెస్ భావించింది. ఇప్పుడు మరో అనూహ్యమైన అభ్యర్థిని పోటీలోకి తేవడానికి ప్రయత్నిస్తుందేమో చూడాలి' అని ఆయన పేర్కొన్నారు. కాగా, చన్నపట్నం నుంచి యోగేశ్వర్ బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తారని ప్రచారం జరుగుతున్నది.

**రేణుకాస్వామి ఒంటిపై 15 గాయాలు**

కన్నడ హీరో దర్శన్ చేతిలో చిత్రహింసలకు గురై హతమైనట్టు భావిస్తున్న రేణుకాస్వామి పోస్టుమార్టం నివేదిక వెలువడింది. హతుడు తీవ్ర రక్తస్రావం, షాక్ కారణంగా మరణించినట్టు పోస్టుమార్టం ద్వారా వెల్లడైంది. దర్శన్, అతని అనుచరుల చేతిలో దెబ్బలకు రేణుకాస్వామి హతమైనట్టు ఇప్పటికే పోలీసు దర్యాప్తులో వెల్లడైంది. దానిని నిర్ధారించేలా హతుని ఒంటిపై 15 గాయాలు ఉన్నట్టు నివేదిక తెలిపింది. రేణుకాస్వామిని చిత్రదుర్గ నుంచి బెంగళూరుకు, అక్కడి నుంచి నిందితులను కారులో తీసుకువచ్చిన రవి అనే డ్రైవర్ పోలీసుల ఎదుట లొంగిపోయాడు. హీరో దర్శన్‌కు పోలీస్ స్టేషన్‌లో సకల మర్యాదలు చేస్తున్నారని జరుగుతున్న ప్రచారాన్ని కర్ణాటక ప్రభుత్వం కొట్టివేసింది.

## పోక్సో కేసులో యెడియూరప్పకు ఊరట

**అరెస్ట్ చేయవద్దంటూ హైకోర్టు ఆదేశం**

బెంగళూరు, జూన్ 14: లైంగిక వేధింపుల కేసులో కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి, బీజేపీ సీనియర్ నేత యెడియూరప్పకు తాత్కాలిక ఊరట లభించింది. అతడిని అరెస్ట్ చేయడం లాంటి బలవంతపు చర్యలు చేపట్టకుండా నిలిపివేసిన కర్ణాటక హైకోర్టు, యెడియూరప్ప దర్యాప్తు సంస్థ అధికారి ముందు విచారణకు హాజరు కావాలని ఆదేశించింది. 17 ఏండ్ల బాలికను వేధించిన పోక్సో కేసులో దర్యాప్తు సంస్థ సీఐడీ విజ్ఞప్తి మేరకు యెడియూరప్పపై ఫాస్ట్ ట్రాక్ కోర్టు నాన్ బెయిలబుల్ వారెంట్‌ను జారీ చేసింది. అయితే తాను జూన్ 17న పోలీసుల ఎదుట హాజరవుతానంటూ యెడియూరప్ప పోలీసులకు లేఖ పంపినందున పిటిషనర్‌ను వెంటనే అరెస్ట్ చేయడం, అదుపులోకి తీసుకోవడం వంటి చర్యలు తీసుకోరాదని జస్టిస్ కృష్ణ ఎస్ దీక్షిత్ తన ఆదేశాల్లో పేర్కొన్నారు.





